వార్త

# సమాజంలో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాం

## - ఎస్‌వీఐటీ వైస్ ఛైర్మన్ సి.చంద్రధర్‌రెడ్డి

రాప్తాడు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త

అధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్న నేటి సమాజంలో విద్యార్థులను సమాజ భవిష్యత్తు నిర్దేశకులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని ఎస్‌వీఐటీ కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఎస్‌వీఐటీ కళాశాలలో పరిపాలనాధికారి వై.మధుసూదన్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్, డిగ్రీ చదువులు పూర్తయిన తర్వాత ఉద్యోగాన్వేషణలో విద్యార్థులు విఫలమవుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని చదువు పూర్తయ్యేలోపు చివరి సంవత్సరంలో ఉద్యోగాలను చూపించే బాధ్యతను తీసుకుంటున్నామన్నారు. ఇప్పటివరకు చాలా సార్లు వివిధ కంపెనీల భాగస్వామ్యంతో జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. తాజాగా ఈనెల 24న(శనివారం) తమ కళాశాల చరిత్రలో జైన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. బీటెక్, డిగ్రీ చదువుతున్న చివరి సంవత్సరం విద్యార్థులతోపాటు 2015, 2016, 2017 ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులు ఈ మేళాకు హాజరుకావచ్చన్నారు. ప్రధానంగా ఆయా కోర్సుల్లో సాధించిన ఉత్తమ మార్కులేకాకుండా సీవీ(కరిక్యులమ్ విటా), బయోడేటా వివరాలు తదితర వాటిని నిపుణులు ఎంపిక చేసే వీలుంటుందన్నారు. ఈ మెగాజాబ్‌మేళాలో ఎంపికైన వారికి ఏడాదికి రూ.1.7లక్షల నుంచి 3.7లక్షల వరకు వేతనం లభిస్తుందన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరికీ జీవితంలో ఎదురయ్యే వివిధ సమస్యలను అధిగమించేందుకు ప్రస్తుతం ఉద్యోగం కీలకంగా మారిందన్నారు. నిరుద్యోగ సమస్యను తీర్చేందుకు తమవంతు కృషిచేస్తున్నామని.. ఆసక్తిగల ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళాకు హాజరయ్యేవారు ఇంటర్వ్యూలు నిర్వహించే వారిని మెప్పించేలా చురుగ్గా సమాధానాలివ్వాలని సౌందాగా వ్యవహరించాలన్నారు. మేళాకు హాజరయ్యే విద్యార్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్‌వీఐటీఏటీపీ.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న వైస్ ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి